క్లుప్తంగా

వైరా ఎస్సైగా రామారావు


రామారావు

వైరా: వైరా నూతన ఎస్సైగా పుష్పాల రామారావు బదిలీపై రానున్నారు. ఇప్పటి వరకు వైరా ఎస్సైగా పనిచేసిన వంశీకృష్ణ భాగ్యరాజ్‌ను ఖమ్మం కమిషనరేట్‌కు అటాచ్ చేయగా.. ఆయన స్థానంలో టాస్క్‌ఫోర్స్ ఎస్సై రామారావు వచ్చారు. 2004 బ్యాచ్‌కు చెందిన రామారావు ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాలో పని చేశారు. కారేపల్లి, ఖమ్మం రూరల్‌లో టాస్క్ ఫోర్స్‌లో పనిచేసి వైరాకు బదిలీపై వస్తున్నారు.

కప్పలబంధంలో ఆర్డీఓ పర్యటన


ఇందిరమ్మ ఇంటి వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీఓ రాజేందర్‌గౌడ్

కల్లూరురూరల్: మండలంలో ఇందిరమ్మ గృహాలు మంజూరు అయిన లబ్ధిదారుల వివరాలను కల్లూరు ఆర్డీఓ రాజేందర్‌గౌడ్ శుక్రవారం పరిశీలించారు. మండలంలోని కప్పలబంధం గ్రామంలో శుక్రవారం ఆర్డీఓ రాజేందర్ గౌడ్ పరిశీలించి.. ఇంటింటికీ వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలోని అనర్హులకు ఇళ్లు మంజూరు చేశారంటూ లబ్ధిదారుల ఫిర్యాదుల మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

'భరత్' విద్యార్థులకు అభినందన


విద్యార్థిని అభినందిస్తున్న డీఈఓ

మధిర: మండలంలో పదో తరగతి ఫలితాల్లో ప్రథమ స్థానం సాధించిన భరత్ కిడ్స్ అండ్ టెక్నో స్కూల్ విద్యార్థులను శుక్రవారం డీఈఓ సత్యానారాయణ అభినందించారు. మధిర భరత్ స్కూల్‌కు చెందిన శీలం రాజశేఖర్ రెడ్డి, తల్లపురెడ్డి భార్గవ్ రెడ్డి 579/600 మార్కులతో మండలంలో ప్రథమ స్థానంలో నిలిచారు. అదే విధంగా ఉత్తమ మార్కులతో మండలంలో ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన చలువాది శైలేష్, నరెడ్ల దేవా హర్షరెడ్డిలను కూడా డీఈఓ సన్మానించారు. విద్యార్థులను తీర్చిదిద్దిన భరత్ విద్యా సంస్థల అధినేత శీలం వెంకటరెడ్డిని సైతం అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలలో చదివించండి

కల్లూరురూరల్: తలిదండ్రులు తమపిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించాలని ఎంఈఓ పత్తిపాటి నివేదిత అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కొత్తబూడిమల్లి, లక్ష్మీపురం, కప్పలబంధం గ్రామాలలో ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, సీఆర్పీలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

చింతకాని: మండలంలోని ప్రొద్దుటూరులో ఎన్నెస్పీ కాల్వ సమీపాన జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ప్రైవేట్ బ్యాంక్ ఉద్యోగి లోకేష్ ద్విచక్ర వాహనంపై ప్రొద్దుటూరు వెళ్తుండగా ఎదురుగా వచ్చిన బోలేరో వాహనం ఢీకొట్టింది. బుధవారం జరిగిన ఈ ఘటనలో ఆయనకు తీవ్రగాయాలు కాగా, లోకేష్ భార్య శుక్రవారం చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

పాలాభిషేకం


మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

చింతకాని: మండలంలోని నాగులవంచ గ్రామంలో ప్రధాని మోదీ చిత్రపటానికి బీజేపీ మండల నాయకులు శుక్రవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత సైన్యం పాకిస్తాన్‌లోని ఉగ్రస్థావరాలపై దాడి చేసి విజయకేతనం ఎగరవేసిందని, సైన్యానికి ప్రజలు మద్దతుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గోపి, నాయకులు రామారావు, శ్రీను, తాతారావు, మంగయ్య, సత్యనారాయణ, అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'కి ఎసరు..


మత్కేపల్లిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

- తగ్గిన పనిదినాలు
- ఆందోళనలో కూలీలు

చింతకాని: గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ, నిరుపేద కూలీల కోసం 19ఏళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని తీసుకొచ్చి.. ఇప్పుడు ఎసరు పెట్టే ప్రయత్నం చేస్తుంది. 2006లో యూపీఏ ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేయడంతో పాటు చట్టబద్ధత కల్పించగా.. ఆ పథకానికి కేంద్రం పరిమితులు విధించి నీరుగార్చే ప్రయత్నం చేయడం సరికాదని ప్రజలు వాపోతున్నారు.

తగ్గిన పనిదినాలు..

ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ పథకంలో పనిదినాలు తగ్గించడంతో గ్రామీణ ప్రాంతాల్లోని పేదలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఉపాధి కూలీలకు రోజువారీ కూలీ గరిష్టంగా రూ.260 రూపాయల వరకు వస్తుంది. నాలుగు నెలలపాటు నిరంతరాయంగా కూలీ పనులు దొరకడంతో కూలీల జీవనం సజావుగా సాగేది. కుటుంబంలో ఇద్దరు, ముగ్గురు ఉపాధి పనులకు పోతే రోజుకు రూ.750 కూలీ వచ్చేది. ప్రస్తుతం ఉపాధి పనులు తగ్గించటంతో జీవనపోరాటం తప్పదని కూలీలు వాపోతున్నారు. పాలనాపరంగా కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాల వల్ల పల్లె ప్రాంతాల్లో మళ్లీ ఆకలి కేకలు ఉండడంతో పాటు వలసలు తప్పవని పలువురు వాపోతున్నారు.

ప్రభుత్వ పనులపై ప్రభావం..

ఉపాధిహామీ నిధులను రాష్ట్ర ప్రభుత్వం రహదారులు, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం వంటి పనులకు వినియోగిస్తుంది. అంతేకాకుండా ఈ ఏడాది చేపల కొలనుల నిర్మాణాన్ని కూడా ప్రారంభించింది. ఉపాధిహామీ పనిదినాలను తగ్గించటంతో ప్రభుత్వ అభివృద్ధి పనులపై ప్రభావం పడే అవకాశం ఉందని పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పనిదినాల కోటా కేటాయింపు ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం పారదర్శకంగా చేయటం లేదన్నారు.

జిల్లావ్యాప్తంగా 2.85 లక్షల మంది కూలీలు..

జిల్లా వ్యాప్తంగా 20 మండలాల్లోని 571 గ్రామ పంచాయతీల్లో ఉపాధిహామీ పథకం ద్వారా 2.85 లక్షల మంది కూలీలు ప్రతి ఏడాది ఉపాధి పనులకు వెళ్తున్నారు. అయితే మొత్తం 2.93 లక్షల జాబ్‌కార్డులుండగా.. 6.19లక్షల మంది రిజిస్టర్డ్ కూలీలున్నారు. వీరిలో ప్రస్తుతం 1.69లక్షల జాబ్‌కార్డుల్లోని 2.85లక్షల మంది కూలీలు మాత్రమే ఉపాధి పనులు చేస్తున్నారు.

వందరోజుల పని కల్పించాలి..



ఉపాధిహామీ పథకంలో ప్రతి కుటుంబానికి వంద రోజుల పని కల్పించాలి. వ్యవసాయ పనులు ముగిసిన తర్వాత మూడు నెలల పాటు ఉపాధి పనికి వెళ్లి జీవనం సాగిస్తున్నాం. ఈ పథకంతో ఎంతో మంది నిరుపేదల ఏడాదికి వంద రోజుల ఉపాధిని పొందుతున్నారు. ఉపాధిహామీ పనులు కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నాయి.

– సంకెళ్ల లక్ష్మి, ఉపాధి కూలీ, మత్కేపల్లి

పనిదినాలు తగ్గించటం సరికాదు..



కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పనులను తగ్గించటం సరైంది కాదు. ఈ పథకంతో ఉన్న ఊరునూ అయినవారినీ విడిచి పొట్ట చేతబట్టుకుని ఎక్కడికో వలస పోకుండా ఉన్నచోటే పని దొరుకుతుంది. కేంద్ర ప్రభుత్వం పథకానికి పరిమితులు విధించి నీరుగార్చే ప్రయత్నాలు చేయటం మంచి పద్ధతి కాదు.

– పగడాల కోటయ్య, ఉపాధి కూలీ, మత్కేపల్లి

'భూ భారతి'తో సమస్యలు పరిష్కారం


మాట్లాడుతున్న ఆర్డీఓ నరసింహారావు

బోనకల్: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి చట్టంతోనే రైతుల సమస్యలు పరిష్కారమవుతాయని ఆర్డీఓ జి.నరసింహారావు అన్నారు. మండలంలోని చొప్పకట్లపాలెం, నారాయణపురం గ్రామాల్లో జరుగుతున్న రెవెన్యూ సదస్సులను శుక్రవారం ఆయన పరిశీలించారు. చొప్పకట్లపాలెంలో 79 దరఖాస్తులు, నారాయణపురంలో 99 దరఖాస్తులు రాగా.. వాటిని పరిశీలించి రైతులతో మాట్లాడారు. రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి తీసుకున్న ప్రతి దరఖాస్తుపై క్షేత్రస్థాయి పరిశీలన జరుగుతుందన్నారు. కొత్త చట్టం ద్వారా లావాదేవీల సేవలు, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేసే వాటిని రికార్డులో పొందుపరచడం జరుగుతుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పున్నం చందర్, రాంబాబు, ఆర్ఐలు నవీన్, మైథిలీ, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ఆశ'లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి


సమ్మె నోటీస్ అందిస్తున్న ఆశా కార్యకర్తలు

ఎర్రుపాలెం: ఆశా కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆ సంఘం మండల కమిటీ అధ్యక్షురాలు నంద్రు సుధారాణి డిమాండ్ చేశారు. ఆ మేరకు శుక్రవారం బనిగండ్లపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి కార్తీక్‌కు ఆశాలు సమ్మెనోటీస్ అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆశాలను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, లేబర్ కోడ్స్ రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఈ నెల 20న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో రమాదేవి, సునీత, నాగమణి, ఏసుమణి తదితరులున్నారు.

గ్రేట్ విజన్ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా పుల్లారావు


లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం

వైరా: వైరా గ్రేట్ విజన్ లయన్స్‌క్లబ్ నూతన అధ్యక్షుడిగా వైరాకు చెందిన జాలా పుల్లారావు నియమితులయ్యారు. తాజా మాజీ క్లబ్ అధ్యక్షుడు తోటకూర శ్రీకాంత్ ఆధ్వర్యంలో 2025–26 సంవత్సరానికి గాను నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా జాలా పుల్లారావు, వైస్ ప్రెసిడెంట్‌గా జాలా మహాలక్ష్మి, సెక్రటరీగా గంగవరపు కిషన్‌రాయ్, ట్రెజరర్ వుయ్యూరి రామకృష్ణ, జీఎంటీ కోఆర్డినేటర్‌గా కట్టా శేఖర్, జీఎస్‌టీ కోఆర్డినేటర్‌గా మచ్చా రామారావు, ఎలమద్ది శ్రీను, పీఆర్‌ఓగా కొర్లకుంట నాగేశ్వరరావులు నియమితులయ్యారు. నూతన కమిటీని పీడీజీ డాక్టర్ కాపా మురళీ కృష్ణ, డాక్టర్ ఉంద్రు శ్యాంబాబు, లగడపాటి ప్రభాకర్, ఉంద్రు వరలక్ష్మి, చింతోజు నాగేశ్వరరావు తదితరులు అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో వేసవి శిక్షణా శిబిరాలు

పెనుబల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 10వ తేదీ నుంచి 24 వరకు వేసవి శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ సత్యనారాయణ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో మండలంలోని వీయంబంజర్ జెడ్పీ ఉన్నత పాఠశాల, టేకులపల్లి మోడల్ స్కూల్, ఉప్పలచెలక కేజీబీవీ పాఠశాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వేసవి శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒకొక్క పాఠశాలలో 100మంది వరకు విద్యార్థులకు శిక్షణకు వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, వారికి స్నాక్స్, శిక్షకులకు గౌరవవేతనం అందించబడుతుందన్నారు. ప్రవేశాలకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఇస్తారని, మొదటి రోజు హాజరయ్యే వారు ఆధార్‌కార్డు, వారు చదువుతున్న పాఠశాల వివరాలు తీసుకుని రావాలని తెలిపారు.

ఉచిత శిక్షణా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం


కొత్తగూడెం ఏరియా జీఎం ఎం.షాలేంరాజు

సత్తుపల్లిరూరల్: సింగరేణి ప్రాజెక్ట్ ప్రభావిత, పునరావాస పరిసర గ్రామాల నిరుద్యోగులు సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులపై నిర్వహించే ఉచిత శిక్షణ కోర్సులకు ఈ 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కొత్తగూడెం ఏరియా జీఎం ఎం.షాలేంరాజు కోరారు. శుక్రవారం సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ సహకారంతో 8వృత్తి కోర్సుల్లో శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు. వివరాలకు 9849411052కు సంప్రదించాలని తెలిపారు.

ప్రభుత్వ భవనంలోకి ఎక్సైజ్ కార్యాలయం


వైరా ఎక్సైజ్ కార్యాలయం ఏర్పాటు చేయనున్న పాత పంచాయతీ భవనం

వైరా: వైరా ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయాన్ని మార్పు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు గత 20ఏళ్లుగా వైరా 20వ వార్డులో ఓ ప్రైవేట్ భవనంలో నిర్వహిస్తున్న ఎక్సైజ్ కార్యాలయాన్ని వైరా పాత పంచాయతీ భవనంలోకి మారుస్తున్నారు. కార్యాలయ నిర్వహణ ఖర్చుతో కూడుకున్న విషయం కావడంతో ఎక్సైజ్ డీసీ జనార్దన్‌రెడ్డి గత వారం క్రితం వైరా కార్యాలయాన్ని సందర్శించినప్పుడు కార్యాలయం మార్పుకు సూచనలు చేశారు.

వైరా ఎక్సైజ్ సీఐ మమత ప్రస్తుత కార్యాలయంలోని ఫైళ్లను కొత్త భవనంలోకి మార్చిస్తున్నారు. ఈ మేరకు కార్యాలయాన్ని మార్చడానికి ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు.

దరఖాస్తు చేసుకోండి

ముదిగొండ: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులు కావాల్సిన వారు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఓ రంగనాయకమ్మ సూచించారు. మండలంలోని 1,460మంది కూలీలు శుక్రవారం ఉపాధిహామీ పనుల్లో పాల్గొన్నట్లు తెలిపారు. ప్రతి శుక్రవారం గ్రామ పంచాయతీల్లో ఉపాధిహామీ క్షేత్రసహాయకులు అందుబాటులో ఉంటారని పనులు కావాల్సిన వారు దరఖాస్తు చేసుకుని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పనులు జరుగుతున్నాయని అన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలం గౌరిగూడెం 33/11 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతులు చేపడుతున్నందున శనివారం ఉదయం 8.30 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శరత్‌బాబు తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని గౌరిగూడెం, కొత్తూరు, రేజర్ల, సిద్దారంరోడ్, రాజీవ్‌నగర్ కాలనీల్లో విద్యుత్ సరఫరాలకు అంతరాయం ఏర్పడుతుందని.. దీనికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఏన్కూరు: మండలంలో శనివారం విద్యుత్ కోతలు విధిస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ ఉమాకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11కేవీ ఏన్కూరు సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం విద్యుత్ కోతలు విధిస్తున్నట్లు ఉదయం 8.30 గంటల నుంచి ఉదయం 10.30 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

నేడు క్యాంపస్ ప్లేస్‌మెంట్

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి నవభారత్ డిగ్రీ కళాశాలలో శనివారం హైదరాబాద్ ఎంఎస్ఎన్ ల్యాబోటరీస్ ఆధ్వర్యాన క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎల్ఎస్ రెడ్డి, జీవీ లింగారెడ్డి, నర్సింహారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ డిగ్రీ 2020వ సంవత్సరంలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు మాత్రమే అర్హులని తెలిపారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి

సత్తుపల్లిరూరల్: కార్మిక హక్కులు, చట్టాల రక్షణ కోసం ఈ నెల 20న చేపట్టే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ పిలుపునిచ్చారు. సత్తుపల్లి మండలం రామానగరంలో శుక్రవారం ఉపాధికూలీల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో మరియమ్మ, ముత్యాలు, సత్యనారాయణ, రాధమ్మ, వెంకటేశ్వర్లు, ప్రసాద్ పాల్గొన్నారు.

సంస్మరణ సభను జయప్రదం చేయండి

కొణిజర్ల: ఈ నెల 11న లాలాపురంలో నిర్వహించే సీపీఎం సీనియర్ నాయకుడు సంక్రాంతి మధుసూధనరావు సంస్మరణ సభలో కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం లాలాపురంలో మధుసూధనరావు స్మారకస్తూప నిర్మాణ పనులను ఆయన స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఆదివారం నిర్వహించే సభకు సీపీఎం పోలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీతో పాటు పలువురు రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వీరభద్రం, రాంబాబు, కృష్ణ, చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

చివరిగింజ వరకు కొనుగోలు చేస్తాం


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ నరసింహారావు

బోనకల్: రైతుల ధాన్యాన్ని చివరిగింజ వరకు కొనుగోలు చేస్తామని మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు అన్నారు. శుక్రవారం మండలంలోని వ్యవసాయ సబ్‌మార్కెట్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ధాన్యంలో ఎలాంటి చెత్తాచెదారం లేకుండా శుభ్రంగా కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలన్నారు. దీంతో రైతులు ధాన్యాన్ని కాంటా వేయడం లేదని, మిల్లర్లు అడగడం లేదని చైర్మన్ దృష్టికి తీసుకురాగా.. ఎవరు అధైర్యపడొద్దని భట్టి ఆదేశాలతో అందరి ధాన్యం తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఐకేసీ మహిళా అధ్యక్షురాలు రేణుక, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దుర్గారావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


అపూర్వ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

ఎర్రుపాలెం: మండలంలోని రామన్నపాలెం ఉన్నత పాఠశాలలో పది చదివిన 1985–86 బ్యాచ్ విద్యార్థులు శుక్రవారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సదర్భంగా అందరు ఒకేచోట కలుసుకొని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. పాఠశాలలో జరిగిన అలనాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. సాయంత్రం వరకు సందడిగా గడిపిన అనంతరం సామూహిక భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మణి మాధురి, నాగలక్ష్మి, జ్యోతి, ప్రసాద్, వెంకట్, కృష్ణారెడ్డి, ఆశీర్వాదం, విజయ్, సత్యం, శ్రీనివాసరెడ్డి, తదితరులున్నారు.

సామూహిక కుంకుమార్చన


యాగశాల వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కారేపల్లి: మండలంలోని అప్పాయిగూడెం జీపీలోని వెంకటసాయినగర్‌లో బొడ్రాయి, ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా శుక్రవారం సామూహిక కుంకుమార్చన చేశారు. శుక్రవారం వేదపండితులు నోముల ఆదినారాయణ, అక్కినపల్లి సంపత్ ఆచార్యులు, చింతోజు బ్రహ్మచారి, వెంకటస్వామి, వారి శిష్య బృందం చే యాగశాల వద్ద కుంకుమార్చన నిర్వహించారు. శ్రీవెంకటసాయి నగర్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు చాందావత్ లక్ష్మణ్, కల్తి భాస్కర్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఈ నెల 9నుంచి 12 వరకు బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు నిర్వహించబడుతాయని, 10న గణపతి పూజా, హోమాలు, 11న బొడ్రాయి, శ్రీముత్యాలమ్మతల్లి, ఆంజనేయస్వామి విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించడం జరుగుతుదన్నారు. అనంతరం మహా అన్నదానం, 12వ తేదీన గ్రామ దేవతలకు బోనాల సమర్పణ కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

గీతా మందిరంలో పుష్పయాగం


స్వామివారికి పుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకులు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని శ్రీగీతాజ్ఞాన మందిరంలోని శ్రీపార్థసారధిస్వామి ఆలయంలో అధ్యాయన బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం రాత్రి పుష్పయాగం నిర్వహించారు. అనంతరం వేదపండితులు శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల రామకృష్ణమాచార్య, అర్చకులు చైతన్య ఆధ్వర్యాన స్వామి కల్యాణ మహోత్సవానికి వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు కొత్తూరు రాజా, ఏపూరి పురుషోత్తం, గుడివాడ చక్రదర్, దాసరి రాఘవయ్య, భాస్కర్‌రావు, బాలాజీరావు, రవీందర్, విజయ, శిరీష, లక్ష్మి, సత్యావతి, కుమారి పాల్గొన్నారు.

సైన్యానికి మద్దతుగా ర్యాలీ


మాట్లాడుతున్న డాక్టర్ రామనాథం

మధిర: ఉగ్రవాదులను తుదముట్టిస్తున్న భారత సైన్యానికి మద్దతుగా శుక్రవారం మధిర పట్టణంలో టీడీపీ ఆధ్వర్యంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ముందుగా స్థానిక పార్టీ కార్యాలయంలో పాకిస్తాన్ ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన పౌరులకు, వీరమరణం పొందిన సైనికులకు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ, ఖమ్మం పార్లమెంట్ కమిటీ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం మాట్లాడారు. పాకిస్తాన్ ఉగ్రవాదులను పెంచి పోషిస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ మధిర అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు గుత్తా సీతయ్య, నాయకులు హనుమంతరావు, సునీల్ కుమార్, కృష్ణారావు, రమేష్, రామకోటి, రత్నకుమారి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా సాగర్ కాల్వలు


వ్యర్థాలతో నిండిన సాగర్ కాల్వ

కొణిజర్ల: మండలంలో ఉన్న సాగర్ కాల్వలు వ్యర్థాలతో నిండిపోయి అధ్వానంగా తయారవుతున్నాయి. తనికెళ్ల నుంచి బోనకల్ బ్రాంచ్ కాల్వ ప్రారంభం అవుతుండగా పలు గ్రామాలకు చెందిన వారు వ్యర్థాలు కాల్వలో పడేస్తున్నారు. దీంతో కాల్వ మొత్తం వ్యర్థాలతో నిండిపోయి.. అధ్వానంగా ఉండడంతో వేసవిలో కాల్వ మరమ్మతులు చేసి వ్యర్థాలు పడేయకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

చెరువు నీరు వృథా..


వృథాగా పోతున్న చెరువు నీరు

మధిర: మధిర పెద్ద చెరువు తూము నుంచి సాగు నీరు వృథాగా పోతుంది. గుర్తుతెలియని వ్యక్తులు మధిర చెరువు తూమునుపైకి లేపడంతో నిరంతరాయంగా చెరువులో ఉన్న నీరు వృథాగా బయటకు పోతుంది. చెరువు నుంచి నీరు బయటకు వెళ్లిపోతే వేసవికాలంలో పశువులకు తాగునీటి ఎద్దడి వస్తుంది. చెరువులో నీరు ఉండటం వల్ల భూగర్భ జలాలు పెరిగి పట్టణంలో బోరు బావుల్లో నీరు నిల్వ ఉంది. చెరువులో నీరు లేక ఎండిపోతే భూగర్భ జలాలు అడుగంటిపోయి తాగునీటి ఇబ్బంది వస్తుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆగుతూ.. సాగుతూ...


బస్సును నెడుతున్న ప్రయాణికులు

ఎర్రుపాలెం: మధిర ఆర్టీసీ డిపోలోని కొన్ని బస్సులు కాలం చెల్లడంతో ఎప్పుడు, ఎక్కడ నిలిచిపోతాయో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. ఈక్రమంలోనే శుక్రవారం ఉదయం మధిర నుంచి విజయవాడ వైపు వెళ్తున్న బస్సు ఎర్రుపాలెంలో ఆగిపోయింది. దీంతో అంతా ఓ చేయి వేయండంటూ ప్రయాణికులు, స్థానికులను డ్రైవర్, కండక్టర్ బతిమిలాడుకుని బస్సును ముందుకు నెట్టించారు. అలా బస్సు స్టార్ట్ కావడంతో మళ్లీ ఎక్కడ ఆగిపోతుందోనన్న భయంతోనే ముందుకు సాగారు.!